


"ఏడాదికొక్కసారి వస్తుంది దీపావళి..." అన్నది రాధ.

"అయితే ఏమంటావు? రోజూ దీపావళి రావాలంటావా?" అని మండిపడ్డాడు రమణ.

"అందుక్కాదు, నే నన్నది. పండగ రోజులు, చేతిలో చిల్లిగవ్వయినా లేదు. పాప ఇప్పటినుంచే 'నాన్న పండక్కి నాకు గౌ లెడు కాకరపువ్వొత్తులూ, మతాబులూ తెస్తారు కదూ!' అని చెప్పుకుని సంబరపడుతోంది." అన్నది రాధ.

పాప, అనగానే రమణ కోపం అంతా చల్లారిపోయింది. ఈ సంవత్సరం వానలు మోసం చేసినయ్యే. ఏం చేస్తాం? మామూలు రోజుల్లోనే అప్పు దొరకటం అంతంతమాత్రం; ఇహ ఈ పండగరోజుల్లో ఎవర్నడగనూ? కూలిపనికూడా దొరక లేదు. నారు పొయ్యటానికని అట్టిపెట్టిన వడ్లున్నయి చూడు, అయ్యన్నా అమ్మి దేవుడికో కొబ్బరకాయ కొట్టి దణ్ణంబెట్టి ఊరుకుందాం. లేకపోతే ఎడ్లూ, బండీ అమ్మాలి. కానీ రేపు వర్షాలు పడితే పొలం దున్నటానికో?" అని గొణుక్కున్నాడు రమణ.



"పోనీలే ఏం చేస్తాం? ఆ ఏడు కొండల వాడే ఉన్నాడు!" అంటూ లోపలికి వెళ్లబోయింది రాధ. రమణకూడా అప్పటి వరకూ కాలుస్తున్న బీడీ పారెయ్యడానికని వసారాలోకి వెళ్ళాడు. అప్పుడే పోస్టువాడు వచ్చి రమణ చేతికి ఒక ఉత్తరం ఇచ్చి వెళ్ళిపోయాడు.

విజయవాడ
5–10–65

అన్నయ్యకు అనేక నమస్కారములు,

ఈ సంవత్సరం దీపావళికి ఈయన అక్కడికి రావాలనుకుంటున్నారు. 'పెళ్లి అయి నాలుగుసంవత్సరాలైంది. ఇంకా మనకు దీపావళి ఏమిటి?' అని నే నెంతో చెప్పి చూశాను; వినటంలేదు. నీకష్టాలు నాకు తెలుసు; ఆయన కేంతెలుసు. పండగపూట బిడ్డను తీసుకుని ఇంకొకరింటికి వెళ్ళకూడదనికూడా అన్నాను. ఎన్నో విధాల మంచిగా చెప్పిచూశాను. 'నాకు ఒంట్లో అంత బాగుండటంలేదు. ఏదైనా పల్లెటూరికి వెళ్ళి నాలుగురోజు లుండాలని ఉన్నది.' అంటున్నారు. నే నేమీ సమాధానం చెప్పలేకపోయాను. మరీ నేను కాదుకూడదన్నా మీ పుట్టింటి సంబరం ఇంతేనా అని నన్ను సాధిస్తారు నే నేంచెయ్యను చెప్పు, అన్నయ్యా! మేమక్కడికి వస్తే బట్టలనీ అవనీ ఇవనీ పెట్టాలి. ఆయన ఇంటిఖర్చులకనిచ్చిన డబ్బులో మిగిల్చి కూడబెట్టినవి నా దగ్గర పదిహేను రూపాయి లున్నయ్యి. నే నక్కడి కొచ్చినప్పుడు ఆయనకు తెలియకుండా నీ కిస్తాను. ఆ డబ్బుతో నీ శక్త్యాను సారం మర్యాద చేసి పంపించు మమ్మల్ని. నా వల్లయినదంతే. దీపావళి ముందు ఒకరోజు ఉందనగా వస్తాము. గుడివాడ స్టేషనుకి రానక్కర్లేదు. బస్‌స్టాండు దగ్గరకు బండి కట్టుకొస్తే చాలు. ఇంతేసంగతులు.

ఇట్లు,
నీ ప్రియమైన చెల్లెలు
శకుంతల.

ఉత్తరం చదువుతుండగా విన్న రాధ.- "ఊం! ఇదీ మనకొక పరీక్షే. ఏంచేస్తాం! తను ఇచ్చే పదిహేను రూపాయిలతో అంతా గడిచిపోతుందా! సరే, ఆ ఉన్న నాలుగుగింజలూ అమ్మి ఏదన్నా చెయ్యాల్సిందే మన బిడ్డ ఆఖరుకి పాతగుడ్డకు కూడా నోచుకోలేదు." అని ఎంతో బాధ పడ్డది.

రమణకూడా ఒక నిట్టూర్పు విడిచి తన బాధనుకూడా వెళ్లబుచ్చుకున్నాడు.

* * * *

రమణ ఇంట్లో తనూ, తన భార్యా బిడ్డా తప్ప ఇంకెవ్వరూ లేరు. ఆ ఊళ్ళో తమకంటే బీదవాళ్ళింకెవరూ లేరేమో! బాగా కష్టపడేవాడే అయితే మాత్రం దరిద్రం పోతుందా? ఆకాశంలో ఉండే మబ్బులు ఆడి ఆడి అలిసిపోతే ఆవురావురుమనే తన పొట్ట నిండుతుంది. తనకున్న ఆ కాస్త పొలానికి కాలవగట్టుగానీ, చెరువుగానీ. భావిగానీ ఏమీలేదు. రమణకు ఒక్కతే చెల్లెలు; బస్తీలో ఇచ్చి పెళ్ళి చేస్తే పచ్చగా బ్రతుకుతారు అని మిల్లులో పని చేసే పోతురాజు కిచ్చి చేశాడు. రేపు అయ్యొచ్చినా పైయ్యొచ్చినా మనకు సహాయంగా ఉంటారు అన్న ఉద్దేశంతోనే చెల్లెల్నిఅతగాడి కిచ్చి కట్టబెట్టింది. ప్రపంచంలో అన్నీ అనుకున్నట్లే జరిగితే ఇంకేం! వాళ్లు రమణకు సహాయం చెయ్యకపోగా తన దగ్గరే సహాయం పొందేవాళ్ళు. రమణ వీటన్నిటితో సతమత మవుతుండేవాడు. కానీ తన భార్యావాళ్లను ఏ ఒక్కమాటన్నా ఊరుకునేవాడుకాడు.

* * *

రేపే దీపావళి. రమణ ప్రొద్దునే లేచి ఎడ్లబండి కట్టుకుని చెల్లెలు రమ్మన్న బస్‌స్టేండుదగ్గిర కెళ్ళి ఎదురుచూస్తున్నాడు. వాళ్లు వచ్చారు; బండిలో కెక్కి కూర్చున్నారు. రమణ బండి వేగంగా పోనిస్తున్నాడు. మనసులో ఎంతో బాధ ఉన్నా పైకి కనుపించకుండా వాళ్లతో సంతోషంగా మాట్లాడుతూ వస్తున్నాడు.

అంతకు ముందురోజు బాగా వర్షం కురవటంవల్ల దారంతా ఒకటే బురద. కొంతదూరం వెళ్ళేసరికి బండి చక్రం బురదలో కూరుకుపోయింది. రమణ తన వల్లనయినంతవరకూ బండి కదులుతుందేమోనని ఎడ్లను కొట్టికొట్టి చూశాడు. ఎద్లుకూడా సాధ్యమైనంతవరకూ లాగి చూసినయ్యి. బండి కొంచెంకూడా కదల్లేదు. అప్పుడు శకుంతల 'ఎడ్లను ఊరికే కొట్టకన్నయ్యా' అంటూ తన భర్తను చూసి. "అక్కడ బస్సు తోశావో లేదో? కొంచెం ఇక్కడ దిగి బండి తొయ్యకూడదూ!" అని నవ్వింది.

అసలు సంగతి ఏమిటీ అంటే - వాళ్ళు వచ్చేటప్పుడు దారిలో బస్సు ఆగిపోయింది. కండక్టరు అందర్నీ క్రిందకు దిగమని కాస్త బస్సు తొయ్యండయ్యా అన్నాడు. బస్సుని తోసినవాళ్ళలో ఈ పోతురాజు కూడా ఒకడు. బస్సు తోసినప్పుడు నామోషి అనిపించలేదు. కానీ బండి తొయ్యమన్నప్పుడు మాత్రం కోపం ముంచుకొచ్చింది. పైకి ఏమీ ఎరుగనట్టు బండిలోనుంచి దిగి అట్లాగే నుంచున్నాడు. అది కనిపెట్టి రమణ తనే దిగి బండిని తోశాడు. బండి కదిలింది. ఇంటి కొచ్చి చేరుకున్నారు.

ఇంటికి రాగానే ఒడ్లు అమ్మి తన భార్య చేతికిచ్చిన వదిరూపాయిలూ తీసుకున్నాడు రమణ. తన చెల్లెలు భర్తకు తెలియకుండా ఇచ్చిన పదిహేను రూపాయిలుకూడా తీసుకుని బనీనులోపల ఉన్న జేబులో వేసుకుని బయలుదేరాడు, దీపావళికి కావలసినవి తేవటానికి.

"అన్నయ్యా! చీర అంచుకి రెండు పట్టుగీరలన్నా ఉండేదిగా చూసి తీసుకొనిరా" అని హెచ్చరించింది శకుంతల.

"నాన్నా! నాకు కాకరపువ్వొత్తులూ, మతాబులూ, చిచ్చుబుడ్లూ" అన్నది రాధ కూతురు.

"మరి నీకు లంగాగుడ్డ కొనవద్దూ ?" అన్నాడు రమణ.

''అదికూడా కావాలి" అన్నది ఆపిల్ల.

'వీటన్నిటికీ డబ్బు?' అనుకుంటూ గుడివాడ బయలుదేరాడు రమణ.

ఆ రోజు సాయంత్రం కావలసినవన్నీ తీసుకుని కాకరపువ్వొత్తులతోసహా రమణ ఇల్లు చేరుకున్నాడు. అవన్నీ చూసిన రాధ, తన బిడ్డకు కనీసం చిన్న గవును గుడ్డన్నా తీసుకొని రాలేదని లోపల్లోపలే బాధపడింది. భర్తదగ్గరున్న డబ్బుకి ఏమి తేలేదు అని తనకు ముందే తెలిసినా, ఎందుకనో ఇప్పుడు మనసు నొచ్చుకున్నది. కోపంకూడా వచ్చింది. అటూ ఇటూ చూసింది శకుంతల. పోతురాజు అక్కడ



లేదు. అది కనిపెట్టి రమణను చూసి, "అది సరేకానీ రేపు మీ చెల్లెలూ వాళ్ళూ కొత్త బట్టలు కట్టుకుంటే, మరి మనం ఏం కట్టుకుని వాళ్ళ ఎదురుగా తిరుగుతాం !" అని అడిగింది.

"నేనేం చెయ్యను రాధా! బట్టలు ధరలు పెరిగిపోయినయ్యి ఇప్పుడు" అన్నాడు రమణ.

"మనకు లేకపోతే పోనీ, పండగకు బిడ్డకు చిన్న గుడ్డముక్కయినా తీసుకొని రావటానికి నీ చేతిలో ఏమీ లేకపోయిందా ?'' అని అడిగింది రాధ.

రమణ తల గోక్కుంటూ, "అందుకే మతాబులూ కాకర పువ్వొత్తులూ తీసుకొచ్చానుగా!" అన్నాడు ఏమీ తోచనివాడిలా.

'అవన్నీ నీ నెత్తినా, నా నెత్తినా కాల్చుకుందాం' అని మండిపడింది రాధ.

అంతలో శకుంతల మొహం చిన్నబుచ్చుకుని లోపలికొచ్చింది. చెల్లెల్ని చూడగానే ''ఏమ్మా ఏమిటలా ఉన్నావు? ఏం జరిగింది?" అని అడిగాడు రమణ.

"ఆయన వెళ్ళిపోయాడన్నయ్యా," అన్నది శకుంతల.

"ఎవరూ... ?"

"ఆయనే!"

''ఎందుకూ ?"

''నేను వచ్చేటప్పుడు దార్లో బండి తొయ్యమన్నానుగదా! 'మీ ఇంటికొస్తే' ఇవ్వాళ బండి తొయ్యమన్నావు; రేపు బండి తోలమంటావు' అని నా మీద కేకలేసి ఊరి కెళ్ళిపోయారు. ఆయన లేకుండా నేనూ పిల్లా ఇక్కడే ఉంటే ఏం బాగుంటుంది. మేమూ వెళ్ళిపోతాం" అని భోరున ఏడ్చింది శకుంతల.

''ఎంత సేపయింది వెళ్ళి ?"


"ఇప్పుడే అన్నయ్యా" అన్నది.

"నువ్వు ఏడవకమ్మా! ఇంకా గుడివాడ వరకూ వెళ్ళి ఉండడు. నే వెళ్ళి ఎట్లాగైనా చెప్పితీసుకొస్తా" నని వెంటనేపరుగెత్తాడు.

కొంచెం దూరంలోనే పోతురాజుని కలుసుకున్నాడు. నిజంగా అలిగి వెళ్ళేవాడయితే, ఊరి కెళ్ళిపోవా లనుకున్నవాడయితే, ఈపాటికి వెళ్ళిపోయుండొచ్చు. అతను అలిగింది పట్టి బెట్టుకోసం. ఎట్లాగయినా రమణ వస్తాడు, బ్రతిమలాడుతాడు అని తెలుసు.

దగ్గరకొచ్చి "పండగనాడు శుభమా అంటూ ఇంటికొచ్చి, ఇలా చెయ్యటం న్యాయమేనా ?'' ఎంతో ఓర్పుగా అడిగాడు రమణ.

"ఇప్పు డెవరేం చేశారు ?" అని మూతి బిగించుకొని త్వరత్వరగా అడుగులు వెయ్యటం ప్రారంభించాడు పోతురాజు.



"అక్కడ చెల్లెమ్మ ఏడుస్తోంది. చంటిది ఒకటే గొడవ! తెలివితక్కువది, ఏదో ఎగతాళి కన్నది. తెలిస్తే అంటుందా? నువ్వు రా ఇంటికి. నేను దాన్ని కొప్పడతానుగా" అని చెయ్యి పట్టుకుని లాగాడు రమణ.

పోతురాజు రెండు మూడు సార్లు చెయ్యి విదిలించుకొని, తన సాధ్యమైనంత వరకూ మొహం కోపంగానే పెట్టుకున్నాడు. భుజంపై నున్న కండువా ఒకటికి రెండుసార్లు దులిపి మళ్ళీ భుజం పైన వేసుకున్నాడు. "నేను దానితో మాట్లాడను. ఇహ నాకూ దానికీ సంబంధం లేదు" అని పెద్ద అబద్ధం కూడా ఆడాడు. చివరకు "నీ మొహం చూసి తిరిగి వస్తున్నాను" అని చెప్పుకుంటూ రమణ వెనకాలే నడిచాడు.

'సిగ్గు చెడినవాడు! మగజన్మ విలువ అంతే' ననుకున్నాడు.

*　　*　　–

మర్నాడు దీపావళి; అందరూ తలంటుకొని స్నానాలు చేశారు. కొత్తబట్టలు వచ్చిన చుట్టాలకు సమర్పించుకున్నాడు రమణ. తన కూతురుకి కాకర పువ్వొత్తులు చేతికిచ్చి ఏవేవో కబుర్లతో నవ్విస్తున్నాడు. ఆ సంతోషంలో కొత్త లంగా సంగతి మర్చిపోతుందని తన ఉద్దేశం. ఆ సిలిపి పిల్ల మర్చిపోతుందీ? "నాన్నా! నాకు చిల్కు లంగా?" అని అందరి ఎదురుగానే అడిగింది.

"ఇప్పుడే కట్టుకుంటే నువ్వు లంగా మాపేసుకుంటావమ్మా. అదంటే బస్తీలో ఉండేపిల్ల. నాజూగ్గా ఉంచుకుంటుంది. నువ్వు సాయంత్రం కట్టుకుందువుగానిలే," అని సర్దిచెప్పాడు.

"ఊ హుఁ"....అంటూ కళ్ళు నలపడం మొదలు పెట్టింది ఆ పిల్ల.

"దాన్ని ఎందుకు ఏడిపిస్తావు? పోనీ కట్టుకోనీయరాదూ? అన్నాడు అరుగు పైన కూర్చున్న పోతురాజు.

రమణకు పరువు పోతుందని మనసులో ఒక ప్రక్క భయం ఉన్నా, పైకి ఏమీ తెలియనట్టుగా "ఆఁ దాని కేం తెలుసు? దాని మొహం. ఇప్పు డేమీ వద్దు, అమ్మ అప్పచ్చులు చేసేలోపల మనం అట్లా వెళ్ళి వద్దాము దా!" అని పిల్లను ఎత్తుకుని బయటికి వెళ్ళిపోయాడు.

రాధ కొత్త చీర కట్టుకోక పోవటం గమనించిన శకుంతల' వదినా, నువ్వు కొత్త చీర కట్టుకోలేదేం?" అని అడిగింది.

లేని సంతోషం మొహంలోకి తెచ్చి పెట్టుకుని "నాకేం తొందరమ్మా ఇప్పుడు; మధ్యాన్నం పనులన్నీ అయినతరువాత కట్టుకుంటానులే," అంటూ అక్కడ నిలబడకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది రాధ.

కొంచెం సేపటికి రమణ ఇంటికి వచ్చాడు. ఏదో బాధతో అటూ ఇటూ తిరుగుతున్న భార్యను చూసేసరికి తన మనసులో ఉన్న విచారం మరింత ఎక్కువైంది. దానికితోడు పిల్ల మళ్ళీ మొదలు పెట్టింది ముఖారిరాగం.

రమణకు పిచ్చి పట్టినట్లయింది. ఏమీ దిక్కు తోచలేదు. ఎదురుగా ఉన్న వెంకటేశ్వరస్వామి పటం చూశాడు. ఆ పటంలోనుండి తిరుపతి వెంకన్న తనను చూసి నవ్వుతున్నట్లనిపించింది.

'ఏడుకొండలవాడా, నన్నెందుకయ్యా ఇలా పరీక్షిస్తున్నావు?' అని లోపల్లోపలే గొణుక్కున్నాడు.

*　　*　　*

ఆ సమయంలో కధ సుఖాంతగా ఉండాలి అనే కొంతమంది తృప్తి పడే సంఘటన జరిగింది. రమణకు ఎదురుగా అనాధ రక్షకుడైన శ్రీనివాసుడు ప్రత్యక్షమయ్యాడు. "భక్త! విచారించకు. ఇవిగో నీకు క్రొత్త ధోవతులు," అని రెండు పట్టు పీతాంబరాలు రప్పించి ఇచ్చాడు. రమణ సంతోషం చెప్ప నలవి కాదు. బట్టలందుకుని కళ్ళ కద్దుకున్నాడు,

"రాధా! ఇదిగో నీకు పట్టు చీర!"

రాధకూడా అంతులేని ఆశ్చర్యంతో ఆనందభాష్పాలు రాల్చింది.

"బిడ్డా! ఇదిగో నీకు సిల్కులంగా!"

వెంకటేశ్వరస్వామి ఇచ్చిన సిల్కు లంగా తీసుకొని సంతోషంతో గంతులు వేసిందా పిల్ల.

ఇదంతా చూసిన రమణకు దీపావళీ ఖర్చులకోసం అమ్మిన ఒడ్లుకూడా ఆ వడ్డికాసులవాడినే అడిగి తీసుకోవాలనిపించి, వెంటనే ఏడుకొండలవాడా వెంకటరమణా గోవిందా అంటూ స్వామి సన్నిధికి, చేరేలోపుగా అతని దురదృష్టం! స్వామి 'గోవిందా' అయినాడు.

తక్షణం పైనుంచి మతాబులూ. చిచ్చుబుడ్లూ. టపాకాయలూ, అన్నీ జల జలా రాలినయ్యి. ఇంకేముంది, ఇద్దరు పిల్లలూ ఒకళ్ళను ఒకళ్ళు తోసుకుంటూ వాటి నన్నిటనీ ఏరుకుని ఒళ్లో వేసుకున్నారు.

*　　*　　*

ఇదేమిటీ, చివరకు కధ గజిబిజిగా ఉందనుకుంటున్నారా? భలేవారు– దీపావళి అంటే ఎంత సంతోషమైన రోజు? ఏదో సరదగా ఉండాల్సిన రోజున ఎందుకు ఏడవటం అని కధను కంచికి పంపించాను.